జాతీయ స్థాయి పోటీల్లో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె

మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబిఎ చివరి సంవత్సరం చదువుతున్న బి.సాయికుషాల్, లింరానజీరా, సమీర్‌అలీ, సాయిసంధ్య, కృష్ణకిశోర్, ముజీబ్ హుస్సేన్ స్థానిక విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ కనపరచి మొదటి, రెండవ బహుమతి పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. లోగో ఐడెంటిఫికేషన్, జామ్, ప్రెషర్స్ పెయింటింగ్, టెక్ డిబేట్, జనరల్ క్విజ్ పోటీలో మొదటి బహుమతులు పొందినట్లు మరియు నజీరా, సాయి జాహ్నవి లు రంగోలి, బెస్ట్ టాక్స్‌లలో రెండవ బహుమతి లభించినట్లు తెలిపారు. ప్రతిభ కనపరిచి గెలుపొందిన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, విభాగాధిపతి డాక్టర్ గీత దేవి, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఒడిలు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : జెసి

ప్రజాశక్తి- రాయచోటి

'జగనన్నకు చెబుదాం', స్పందన కార్యక్రమంల్లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలని జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందనలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, ఎస్‌డిసి శ్రీలేఖ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్‌ఎల్‌ఏ, రీ ఓపెనింగ్ లేకుండా సంతృప్తి స్థాయి పెంగేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరానికి నేటి నుంచి జిల్లాలో రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు కలెక్టర్ గిరీష తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలో డిసెంబర్ 15 నుంచి చేపట్టనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాల నిర్వహణపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 501 సచివాలయాల పరిధిలో క్రీడల నిర్వహణకు శ్రీకారం చుడతామని తెలిపారు. ప్రతి ఒక్కరిని క్రీడల ద్వారా ఆరోగ్యవంతులుగా జీవన శైలిని ప్రోత్సహించడమే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను కనుగొని వారి పెద్ద వేదికకు పరిచయం చేయడం క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. 15 ఏళ్ల పైబడిన ఆసక్తి కలిగిన వారు వెబ్ సైట్, యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని చెప్పారు. సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల నిర్వహణ ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 15 నుంచి 2024 ఫిబ్రవరి 3 వరకు క్రికెట్, కబడ్డీ ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ 5 అంశాలలో క్రీడా పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతి సచివాలయంలో పురుషుల రెండు టీములు మహిళల రెండు టీములు ఆడేలా షెడ్యూల్ వేశామన్నారు. క్రీడలలో ఆసక్తి గల ప్రజలు ఎవరైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. సచివాలయం సిబ్బంది వాలంటీర్లు అర్హులు కాదని తెలిపారు. సచివాలయం స్థాయిలో గెలుపొందిన జట్టుకు మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయని చెప్పారు. సచివాలయ స్థాయి, మండల స్థాయిలో ఆడి గెలిచిన జట్టుకు క్రీడా కిట్లను ఇస్తామన్నారు. నియోజకవర్గ స్థాయిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో నాలుగు అంశాల పోటీలలో విజేతలకు మొదటి బహుమతిగా రూ.35 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు నగదు బహుమానం ఇస్తారన్నారు. జిల్లా స్థాయి విజేతలకు మొదటి బహుమతి రూ.60 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు ఇస్తామన్నారు. రాష్ట్ర స్థాయి విజేతలకు మొదటి బహుమతి రూ.5 లక్షలు, రెండో బహుమతి రూ.3 లక్షలు, మూడో బహుమతి రూ.2 లక్షలు ఇస్తామని చెప్పారు. బ్యాడ్మింటన్‌లో నియోజకవర్గ స్థాయి విజేతలకు మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ. 5 వేలు బహుమానం ఇస్తామన్నారు. బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి విజేతలకు మొదటి బహుమతి 15 వేలు, రెండో బహుమతి 20 వేలు, మూడో బహుమతి 10 వేలు, రాష్ట్ర స్థాయి విజేతలకు మొదటి బహుమతి రూ.2 లక్షలు, రెండో బహుమతి రూ.లక్ష, మూడో బహుమతి రూ.50 వేలు ఇస్తారని చెప్పారు. జిల్లాలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించడానికి వివిధ శాఖలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎంపిడిఒలు, సచివాలయ సిబ్బంది, విద్యాశాఖ పిఇటిలు, రవాణా శాఖ, సివిల్ సప్లై తదితర శాఖల వారి సిబ్బంది క్రీడల్లో సమన్వయం చేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా ఆడుదాం ఆంధ్ర లోగో "కిట్టు" మస్కట్‌ను, ప్రచార కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, జిల్లా స్పోర్ట్స్ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గిరీష, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : 'చింతల'

మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే సాధ్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే పీలేరు మండలం, తలుపుల పంచాయితీ పరిధిలోని అడవిపల్లె, చింతలబైలు, జంగంపల్లె, చిన్నయ్యగారిపల్లె, నగిరి, సాములవారిపల్లె, బయ్యారెడ్డిగారిపల్లె, వరగంరెడ్డిగారిపల్లెలో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం అందించిన పథకాలు లబ్దిదారులకు చదివి వినిపించి, స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి వివరాలు తీసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో వంద శాతం నెరవేర్చిన ఘనత జగన్‌కు మాత్రమే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అడవిపల్లె, జంగంపల్లెలో గ్రామస్తుల కోరిక మేరకు సిమెంట్ రోడ్లు, కాలువల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కార్తీక పౌర్ణమిని పురష్కరించుకుని శ్రీ గుండాల మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపిపి కంభం సతీష్‌రెడ్డి, వైస్ ఎంపిపి వెంకటాచలపతి సర్పంచ్‌లు శిరీష. జగన్మోహన్‌రెడ్డి, ఎంపిటిసి వెంకట రమణ నాయుడు, నాయకులు అబ్బవరం అమర్నాథ్‌రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

ఐక్యంగా ముందుకు సాగుదాం : 'వంగవీటి'

ప్రజాశక్తి- చిట్వేలి

ప్రతి ఒక్కరం చేయి చేయి కలిపి ఐక్యతతో మెలగాలని, ఏ సమస్య వచ్చినా కలిసిమెలిసి పరిష్కారం వైపు అడుగులు వేయాలని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాజుకుంట క్రాస్ రోడ్డు వద్ద వెలసిన శ్రీ ఆంజనేయస్వామి ఆవరణలో బలిజ వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహ, ఎంపిటిసి నానబాల నాగార్జున, కనకరాజు రాజుకుంట గ్రామస్తుల పర్యవేక్షణలో వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని కాపులు రాకతో జనసంద్రంగా మారింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వంగవీటి రాధా, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులు, వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మలిశెట్టి వెంకటరమణ, అత్తిగారి దినేష్, బిజెపి నాయకులు సాయి లోకేష్, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా వంగవీటి రాధ మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా అందరూ కలిసికట్టుగా పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం సర్పంచ్ గుత్తి నరసింహ మాట్లాడుతూ మండల, నియోజకవర్గం నుంచి బలిజ వన భోజనానికి విచ్చేసి, అందరి సహకారంతో విజయవంతం చేసిందినందుకు సహకరించినందుకు నాయకులకు, స్నేహితులకు, గ్రామస్తులకు పేరుపేరునా అభినందనలు తెలిపారు. వంగవీటి రాధా రాకతో రైల్వేకోడూరు నుండి చిట్వేలి వరకు రోడ్డు మార్గాన అడుగడుగునా ఆయనకు ఘన స్వాగతం పలికారు.

రాధాకు మెమొంటోను అందజేస్తున్న నరసింహ, నాగార్జున

బిసిల సంక్షేమం మరిచిన ప్రభుత్వం

- వడ్డెర్ల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ దేవళ్ల మురళి

సమావేశంలో మాట్లాడుతున్న దేవళ్ల మురళి

ప్రజాశక్తి-పీలేరు

వడ్డెర్ల సంక్షేమం, అభివృద్ధిని ఆకాంక్షించిన నాయకుడు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఒక్కడేనని వడ్డెర్ల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ దేవళ్ల మురళి తెలిపారు. వడ్డెర్ల సంఘం పీలేరు నియోజకవర్గం అధ్యక్షులు బత్తుల రామస్వామి అధ్యక్షతన సోమవారం స్థానిక రోడ్లు భవనాల అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బిసిలను విభజించి పాలిస్తోందే తప్ప వారి సంక్షేమం గురించి ఆలోచించలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్ర సందర్భంగా వడ్డెర్ల తలపై చేయిపెట్టి, ముద్దాడి హామీలు గుప్పించాడే తప్ప ఈ నాలుగేళ్ల ఎనిమిది నెలల్లో ఒరగబెట్టింది, ఇరగబెట్టింది ఏమీ లేదన్నారు. కనీసం వడ్డెర్ల కార్పొరేషన్‌కు రూ.లక్ష కూడా నిధులు విదిలించలేదని, చివరికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించిన పాపాన కూడా పోలేదని చెప్పారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా రూ.16 వేల కోట్లు లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ వడ్డెర్ల ఆత్మగౌరవం కోసం వడ్డెర్ల కార్పొరేషన్‌కు రూ.132 కోట్లు నిధులు కేటాయించారని గుర్తు చేశారు. వడ్డెర్లను ఎస్టీల జాబితాలో చేర్చడానికి సత్యపాల్ కమిటీని ఏర్పాటు చేసి జిఒ 172 తీసుకొచ్చింది కూడా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అని తెలియజేశారు. ఆదరణ పథకం ద్వారా వడ్డెర్లకు పనిముట్లు, యంత్రాలు సమకూర్చింది కూడా టిడిపి ప్రభుత్వమే అని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వంలో వడ్డెర్ల సంక్షేమం, అభివృద్ధి కోసం చేసింది ఏమీ లేదని విమర్శించారు. ప్రభుత్వాన్ని కాలగర్భంలో కలిపేసే సమయం ఆసన్నమైందని, 2024 సాధారణ ఎన్నికల్లో ఈ రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవడం ఖాయమని, నియోజకవర్గంలో నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి గెలుపు తథ్యమని జోస్యం చెప్పారు. నియోజకవర్గంలో వడ్డెర్ల కోసం వైసిపి ప్రభుత్వం కానీ, ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న చింతల రామచంద్రారెడ్డి కానీ ఏం సాధించి పెట్టారో బహిరంగంగా ప్రజలకు చెప్పాలని పేర్కొన్నారు. నియోజకవర్గ వడ్డెర్ల కోసం రూ.5 వేల కోట్లు నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని నిలదీసి అడిగే దమ్ము్యా, ధైర్యం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వడ్డెర్ల నోరు కొట్టి కుప్పం, పలమనేరు, మదనపల్లి, పీలేరు ప్రాంతాల్లో బినామీ పేర్లపై క్వారీలను లీజుకు నడుపుతున్నారని కూడా ఆరోపించారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం ఉండే కార్పొరేషన్ల నామినేటెడ్ చైర్మన్ పదవులకు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారిని ఎంపిక చేశారని, నిధులు లేని కార్పొరేషన్లకు బిసిలను ఎంపిక చేసి విధులు అప్పగించారని ఆరోపించారు. ఆ పదవులకు బీసీలు వడ్డెర్లు అర్హులు కారా అని కూడా ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో బీసీల బలమేంటో, వండర్ల సత్తా ఏంటో చూపెడతామని తెలిపారు. సమావేశంలో రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం వడ్డెర్ల సంఘం ఉపాధ్యక్షులు బట్టల రమాదేవి, వడ్డెర్ల సంఘం రాయలసీమ జిల్లాల అధ్యక్షులు దేవళ్ళ శ్రీనివాసులు, పీలేరు నియోజకవర్గ యువ అధ్యక్షులు బత్తల ప్రసాద్, తిరుపతి జిల్లా వడ్డర్ల యువజన సంఘం అధ్యక్షులు డి.శ్రీను, బాలాజీ వెంకటేష్ పాల్గొన్నారు.

రైతుకు నానో యూరియా అందజేస్తున్న అధికారులు, సర్పంచ్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రామసముద్రం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ నారాయణస్వామి, వైస్ ఎంపిపి గంగాధర్‌నాయుడు, సర్పంచ్ చరణ్, వెంకటరమణ అన్నారు. మండలంలోని కమ్మవారిపల్లి సచివాలయంలో సోమవారం వీక్షిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర పథకాలు ద్వారా లబ్ధి చేకూరని వారికి ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. ప్రజలకు అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసికెళ్లి అమలు చేయడమే కార్యక్రమ ముఖ్య లక్ష్యంమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అయుష్మాన్ భారత కార్డులు అందిస్తున్నదన్నారు. ఆరోగ్యశ్రీ కార్డ్ పొందిన వ్యక్తులు బెంగళూరు, చెన్నై, ఢిల్లీ ప్రాంతాల్లో వైద్య సదుపాయం పొందవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సుధాకర్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ కుమార్, హెచ్‌పి గ్యాస్ మధు, బిజెపి నాయకులు కృష్ణమూర్తి, ఆనంద్ నాయుడు, ఆర్‌బిఐ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ఎంతో విలువైంది

- హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర

ప్రజాశక్తి-బి.కొత్తకోట : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థినీ,విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యత, నమోదు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. ప్రజలు ఓటు ద్వారానే తమకు మంచి చేసే ప్రజాప్రతినిధులను ఎన్నుకొనే అవకాశం ఉందన్నారు. ఓటు అనేది ప్రజలకు ఆయుధం లాంటిదన్నారు. యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. 18 ఏళ్లు పూర్తయిన యువతీ, యువకులు ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. తమ పరిధిలోని బిఎల్‌ఒలు, రెవెన్యూ సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రఫీక్ అహ్మద్, నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి, ఆర్‌ఐ శ్రీనివాసులు, రెవెన్యూ ఆర్‌ఐ బాలాజీ, నగర పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌టియు మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -గాలివీడు : మండలానికి సంబంధించి ఎస్‌టియు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కౌన్సిల్ సభ్యులు రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం రాయచోటి డైట్‌లో నిర్వహించిన ఎస్‌టియు రీజియన్ కౌన్సిల్ సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కాల్వపల్లి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జిట్టా నాగరాజు, ఆర్థిక కార్యదర్శిగా కమ్మెల్ల నాగేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్లుగా మున్వర్ బాష, జగదీశ్వర్‌రెడ్డి బి.వి.ఆర్ నాయక్, ఐ.చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు.

లోకేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న చమర్తి, రమేష్‌రెడ్డి

లోకేష్‌ను కలిసిన చమర్తి, ఆర్‌ఆర్

ప్రజాశక్తి- రాయచోటి : రాజోలులో యువగళం పాదయాత్రలో టిటిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి సోమవారం వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో జనం తాండోప తండాలుగా వచ్చి లోకేష్ బాబును ఆదరిస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికలలో వైసిపిని కాలగర్భంలోకి కలుపుదామని తెలిపారు. పాదయాత్రలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, మండల రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - బి.కొత్తకోట : నగర పంచాయతీ పరిధిలోని కరెంట్ కాలనీ చివరి వీధిలో రెండేళ్లుగా వీధిలైట్లు ఏర్పాటు చేయలేదని స్థానిక ప్రజలు ఆరోపించారు. సోమవారం వారు మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలకు సైతం తామే డబ్బులు చెల్లించి ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. రెండేళ్లు గడుస్తున్నా లైట్లు ఏర్పాటు చేయలేదన్నారు. సంబంధిత వాలంటీర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమస్యను సచివాలయం కన్వీనర్ దృష్టికి తీసుకువెళ్తానని పరిష్కరించడానికి కృషి చేస్తానని వాలంటీర్ హామీ ఇచ్చారు. నగర పంచాయతీ కమిషనర్ ఈ సమస్యపై దృష్టి సారించి స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

పేదలకు వరం జగనన్న బీమా

ప్రజాశక్తి-నందలూరు: జగనన్న బీమా పేదలకు వరంలాంటిదని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. ఇటీవల తోటపాలెంకు చెందిన సయ్యద్ లహత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి రూ.5 లక్షల జగనన్న బీమా మంజూరైంది. సోమ వారం రూ.పది వేల నగదును మృతుని కుటుంబానికి అందజేశారు. మిగిలిన మొత్తం బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని సర్పంచ్ సూర్య నారాయణ, మండల పరిషత్ కార్యాలయ ఎఒ ప్రకాష్ పేర్కొన్నారు. సయ్యద్ లాహత్ మృతితో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. ఆ కుటుంబానికి అండగా జగనన్న భీమా లభించిందిని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అధికారి లక్ష్మిశరణ్య, పంచాయతీ సిబ్బంది నరసింహులు పాల్గొన్నారు.

బాధితులకు చెక్‌ను అందజేస్తున్న సర్పంచ్ సూర్యనారాయణ

2న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి- రాయచోటి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 2న స్థానిక శ్రీ సాయి ఇంజినీరింగ్ కళా7 శాలలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నామని, నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెగా జాబ్ మేళాలో బహుళ జాతి వంద కంపెనీలు పాల్గొనున్నాయని తెలిపారు. వాటి ద్వారా రాయలసీమ పరిధిలోని నిరుద్యోగ యువతి యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. మెగా జాబ్ మేళాలో గూగుల్, ఫ్లిప్ కార్ట్, హెటేరో డ్రగ్స్, కియా మోటార్స్, ముతూట్ ఫైనాన్స్, టెక్నాలజీస్, అపోలో ఫార్మసీ, లాంటి బహులజాతి కంపెనీలు పాల్గొంటాయన్నారు. రిజినల్ జాబ్ మేళాలో హాజరు అయ్యే నిరుద్యోగ యువతీ,యువకులు పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బి.ఫార్మసీ/ఎం.ఫార్మసీ, నర్సింగ్/పీజీ చదివిన వారు 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 10 వేల నుంచి రూ. 50 వరకు జీతం ఉంటుందని పేర్కొ న్నారు. ఈ ఇంటర్వ్యూలకు హాజరు అయ్యే అభ్యర్థులు కచ్చితంగా విద్యా ర్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు ఫొటోలతో అర్హత కలిగిన నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7799587687, 8897776368, 9177143181లలో సంప్రదించాలన్నారు. అభ్యర్థులు https://skilluniverse.apssdc.inలో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

చిత్రకళా ప్రదర్శనను సందర్శించిన ప్రముఖులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : జిఎంసి కల్యాణ మండపంలో చిత్ర కళాకారుడు నాయిని గిరిధర్ ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శనను రెండవ రోజైన సోమవారం పలు రాజ కీయ ప్రముఖులు సందర్శించి పులకించారు. ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జున రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్‌తో పాటు పలువురు ప్రముఖ నాయకులు చిత్రకళా ప్రదర్శన సందర్శించి చిత్రకారుడు గిరిధర్‌ను అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వివిధ రకాల చిత్రకళలను చూడడం జరిగింది కానీ, గిరిధర్ నుంచి రూపొందించబడిన చిత్రాల ముందు అవన్నీ దిగదుడుపేనని పేర్కొన్నారు. ఇటువంటి కళాకారుడు తమ ప్రాంతంలో ఉండడం రాజంపేట వాసుల అదృష్టమని తెలిపారు. కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, ఎంపిటిసి నాగ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గిరిధర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి -గాలివీడు

గోపనపల్లి గ్రామ పంచాయతీలో 130 కె.వి సబ్‌స్టేషన్ మంగళ వారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీష్ పరిశీలించారు. పైలాన్ సభా భవన స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌డి, తహశీల్దార్, అధికారులున్నారు.

అధికారులను విచారించిన జడ్జి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ఆడపూరు వద్దగల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలకు సంబంధించిన పిఎల్‌సి నంబర్ 54/2023 కేసు విషయమై నందలూరు జూనియర్ సివిల్ జడ్జి లత నోటీసులు జారీ చేయగా సోమవారం జరిగిన విచారణకు ఆ పాఠశాలల డిస్టిక్ కో-ఆర్డినేటర్ సుకన్య, అన్నమయ్య జిల్లా డిఎంహెచ్ఒ కొండయ్య, కళాశాల సిబ్బంది హాజరయ్యారు. జరిగిన విచారణలో కళాశాలలో పిల్లల సమస్యలు, వారి ఆరోగ్య పరిస్థితి గురించి వార్తపత్రికలో వచ్చిన వాటిపై విచారణ చేశారు. తదుపరి డిసెంబర్ నెల నాలుగవ తేదీ 4న జరిగే వాయిదాలో పై వాటికి సంబంధించి అధికారులు తీసుకున్న చర్యలు(సౌకర్యాలు)పై రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని అధికారులను జడ్జి లత హెచ్చరించారు.

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వంచే ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికీ బియ్యం'లో భాగంగా ఉపయోగించే ప్రత్యేక వాహనాలు (MDU) ద్వారా రేషన్ సరుకులు పంపిణీ కోసం డ్రైవర్ కం ఆపరేటర్ల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జెసి ఫర్మన్ అహ్మద్ ఒక ప్రటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబందిత తహశీల్దారు, ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

కార్డు దారులకు రాగులు, జొన్నలు పంపిణీ : జిల్లాలోని రేషన్ కార్డుదారులకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా డిసెంబర్ నెలకు రాగులు, జొన్నలు పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్డుదారులు 1కిలో నుంచి 4 కిలోల వరకు బియ్యం బదులుగా రాగులు/జొన్నలు తీసుకోవచ్చున్నారు. మిగతా బియ్యాన్ని ఉచితంగా పొందవచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత శాఖాధికారులు, సిబ్బంది, డీలర్లు, ఎండియూ ఆపరేటర్లు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కొత్తగా పులివెందుల అర్బన్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన అరుణ్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. సికె దిన్నె నుంచి అరుణ్‌రెడ్డి పులివెం దులకు బదిలీ అయ్యారు.

ఎస్ఐ అరుణ్‌రెడ్డి

పీజీ విద్యకు విద్యార్థులు దూరం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

పేద విద్యార్థులకు పీజీ విద్యను జగన్ ప్రభుత్వం దూరం చేసిందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల పాలిట శకుని మామలా, కంస మామలా ముఖ్యమంత్రి జగన్ తయారయ్యారని విమర్శించారు. విద్యార్థులకు నష్టం కలిగించే జిఒ 77ను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, ఇబిసి, కాపు, విభిన్న ప్రతిభావంతుల పేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్యను అందించాలని 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వీటివల్ల అటు డిగ్రీ, ఇటు పిజి విద్యార్థులకు మేలు జరిగేదన్నారు. జగన్ ప్రభుత్వం వీటి పేర్లు మార్పు చేసి జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన అని పెట్టారన్నారు. అంతటితో ఆగకుండా ఈ పథకాలు పిజి విద్యార్థులకు వర్తించవని జిఒ 77 జారీ చేశారన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.550 కోట్లను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నివాళులర్పించిన తులసిరెడ్డి

చక్రాయపేట : సిపిఐ పులివెందుల ఏరియా జాయింట్ సెక్రెటరీ కొత్త కాలువ బ్రహ్మం తండ్రి రామకృష్ణయ్య అనారోగ్యంతో మృతి చెందగా, సోమవారం పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో అమర్‌నాథ్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఉత్తన్న, రామకృష్ణయ్య, వినయ్ పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని 8వ కౌన్సిలర్ వార్డులో ఉన్న శ్రీసీతారామలక్ష్మణ ఆలయం అభివృద్ధికి స్థలం కేటాయించాలని ఆ ప్రాంత ప్రజలు సోమవారం నగర పంచాయతీ కమిషనర్ పగడాల జగన్నాథ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా ఏళ్లుగా పూజారి లేక నిత్య దీపారాధన జరగడం లేదన్నారు. దేవాలయానికి ఆదాయ వనరు ల్లేని కారణంగానే శాశ్వత పూజారిని నియమించుట, దీపారాధన వంటివి లేవన్నారు. పట్టణంలోని బస్టాండ్ పక్కనున్న ప్రభుత్వ స్థలంలో పది సెంట్లు ఆలయానికి కేటాయించాలని వారు కమిషనర్‌ను కోరారు. ప్రభుత్వం కేటాయించే స్థలంలో దాతల సహకారంతో శాశ్వత రేకుల షెడ్లు, రూములు నిర్మించి వచ్చే బాడుగుల ఆదాయంతో పలు కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఆ మేరకు శ్రీరాములపేట వాసులతో సంతకాలు సేకరించి వినతి పత్రాన్ని కమిషనర్‌కు అందించారు. కమిషనర్ జగన్నాథ్ స్పందిస్తూ ఆలయానికి స్థలం కేటాయించే విషయాన్ని కౌన్సిల్ ఆమోదం కోసం ఎజెండాలో పొందుపరుస్తామన్నారు. కార్యక్రమంలో రాజా, హనుమారెడ్డి, మూలె రామాంజనేయరెడ్డి, శంకర్, మూలె సాయికిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న శ్రీరాములపేట వాసులు

అలరించిన కోలాటం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థాన ఆవరణలో కార్తీక రెండవ సోమవారం సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను అలరించింది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మహిళా కళాకారులు ప్రదర్శించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో అల్లాడుపల్లెకు చేరుకున్నారు. గ్రామ సమీపంలోని కుందు నదిలో కార్తీక స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఇఒ శ్రీనివాసులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. అల్లాడుపల్లె సర్పంచ్ జిసి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భద్రకాళి సమేత వీరభద్రస్వామి అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య, సర్వజన కల్యాణ మండపంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

కోలాటం ప్రదర్శిస్తున్న మహిళా కళాకారులు

ముగిసిన పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా నిర్వహించిన పవిత్రోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు మండలం నుండేకాక జిల్లా నల్ల మూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజా స్వామి, వేద పారాయణదార్ రామ మోహనశర్మ, చైర్మన్ పినుపోలు రాఘువేంద్ర ప్రసాద్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి పాల్గొన్నారు.

పవిత్రోత్సవాల్లో వేద పండితులు, ఎసి, చైర్మన్

- మండలంలోని వేంపల్లి-రాయచోటి మెయిన్ రోడ్డు సురభి గ్రామం నాగలగట్టుపల్లె, దేవరగుట్టపల్లి మార్గమధ్యంలో ఉన్న దశరథ మహారాజు దేవాలయం వద్ద కార్తీకపౌర్ణమి పునస్కరించుకుని సోమవారం దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ సానే సుబ్బరామయ్య, దశరథ మహారాజు ట్రస్ట్ చైర్మన్ సోము దశరథ ఆధ్వర్యంలో వాల్మీకి రామాయణ పారాయణం, సీతారామ కల్యాణం నిర్వహించారు. కడప అవార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన, నటరాజ కళాక్షేత్రం పొద్దుటూరు వారి నాట్య విశారత, మొహిద్దిన్ ఖాన్ ఆధ్వర్యంలో భక్తులు అలరించేలా నాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కోడూరులో అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని వై.కోడూరులోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి సన్నిధిలో అయ్యప్పస్వామి మహా పడిపూజ, గ్రామోత్సవాన్ని అయ్యప్పస్వామి సేవా సంఘం సభ్యులు సోమవారం ఘనంగా నిర్వ హించారు. సోమవారం తెల్లవా రుజాము నుంచి పలు పూజా కార్యక్రమాలు నిర్వ హించారు. పడి పూజకు మండ లంలోని అయ్యప్ప మాలధారులు, భక్తులు తరలివచ్చారు. బండి రమణారెడ్డి ఆధ్వ ర్యంలో అన్నప్రసాద వినియోగాన్ని నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని గ్రామ వీధుల్లో కేరళ వాయిద్యాలు, కోలాట నృత్యాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అయ్యప్ప సేవా సమితి సభ్యులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

పడిపూజలో అయ్యప్ప మాలధారులు

ముందు జాగ్రత్తలతోనే అధిక దిగుబడి

అరటి ఆకులకు ఆశించిన ఆకుమచ్చ తెగులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

అరటి తోటలో సిగటోక తెగులు నివారిస్తే అధిక దిగుబడులు సాధ్యమని ఉద్యాన శాఖ విస్తరణ అధికారి వీరారెడ్డి పేర్కొన్నారు. దీనిపై ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ప్రస్తుతం కొన్ని అరటి తోటల్లో సికటోక తెగులు వ్యాపించిందన్నారు. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధ్యమని ఆయన సూచించారు.

సిగటోక ఆకుమచ్చ తెగులు లక్షణాలు..

ఆకులపై మొదట అక్టోబర్ నెలలో సమాంతరంగా చిన్నచిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. ఇవి క్రమేపీ పెరిగి పెద్దవై బూడిద రంగులోకి మారుతాయి. ఈ మచ్చలు గోధుమ రంగులోకి మారి పరిమాణంలో పెద్దవై ఒకదానితో ఒకటి కలిసిపోతాయి. ఈ మచ్చలు ముందుగా కింది వరుస ఆకులలో ప్రారంభమై క్రమేణా పై ఆకులకు వ్యాపిస్తాయి. తెగులు ఉధృతి పెరిగినప్పుడు మచ్చలు కలిసిపోయి ఆకులు మొత్తం ఎండిపోతాయి. కిరణజన్య సంయోగ క్రియకు అవసరమైన పచ్చదనం లేకపోవడంతో మొక్కలు గెలలు వేసినప్పుడు అవి పండక ముందే కాయలు రాలిపోయే అవకాశం ఉంది.

నివారణ చర్యలు..

తెగులు వ్యాప్తి మొదలైనప్పుడు ప్రొపికొనజల్(ఒక మిల్లీమీటర్ లీటరు నీటికి)తోపాటు మినరల్ ఆయిల్(పది మిల్లీలీటర్లు లీటరు నీటికి) కలిపి ఆకులు మొత్తం తడిసేలా పిచికారి చేయాలి. రెండో పిచికారిలో కార్బన్ డిజైన్‌తోపాటు మ్యాన్కోజెబ్ మిశ్రమం మందును(ఒక గ్రాము లీటరు నీటికి), మూడవ పిచికారి ట్రైఫ్లోక్స్ స్ట్రోబిన్‌తోపాటు డెబ్యూ కొనజల్ మిశ్రమం మందు(1.4 గ్రాములు లీటర్ నీటికి), నాలుగో పిచికారిలో డైపన్ కొనజోల్(ఒక మిల్లీమీటర్ లీటరు నీటికి) కలిపి పిచికారి చేయాలి. ప్రతి పిచికారిలో స్టిక్కర్ గాని సబ్బు పొడిని గాని కలపాలి.

- వీరారెడ్డి, ఉద్యానశాఖ విస్తరణాధికారి, సింహాద్రిపురం

'భూపేష్ గెలుపు.. అభివృద్ధికి మలుపు'

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి గెలుపు జమ్మలమడుగు అభివృద్ధికి మలుపు అని ఆ పార్టీ కన్నెలూరు గ్రామ నాయకులు కె.నవనీశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ 2019 ఎన్నికల తర్వాత తెలుగుదేశం పార్టీలో ఉన్న నాయకులు ఆదినారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి పార్టీని వీడి.. ఒకరు బిజెపి, మరొకరు వైసిపిలోకి వెళ్లారన్నారు. టిడిపికి నాయకుడు లేక పోవడంతో చిన్న వయసులోనే భూపేష్‌రెడ్డి పార్టీని తన భుజస్కందాలపై వేసుకున్నారన్నారు. రెండేళ్లుగా ఆయన నియోజకవర్గంలోని టిడిపి కార్యకర్తలను ముందుకు నడిపిస్తున్నారన్నారు. ఇక్కడి వైసిపి ప్రతినిధి అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలకు చేరువ వుతు న్నారన్నారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ గుర్తించేలా తన విధి విధానాలు రూపొందించుకున్నారన్నారు. ఇదే క్రమంలో లోకేష్ యువగళం పాదయాత్రలో జమ్మలమడుగులో భారీస్థాయిలో జనం వచ్చారన్నారు. ఈ సందర్భంగా లోకేష్, భూపేష్ కలయిక అదిరిందని స్వయంగా లోకేష్ చేతనే చెప్పించుకున్న నాయకుడు భూపేష్‌రెడ్డి అన్నారు. దేవగుడి కుటుంబం అభి వృద్ధికి మూల స్తంభమన్నారు. అలాంటి కుటుంబం నుంచి వచ్చిన భూపేష్‌రెడ్డిని 2024లో ఎమ్మెల్యేగా గెలిపించుకొని ఈ ప్రాంతాన్ని, అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇక్కడి ప్రజాప్రతినిధి చేతిలో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందన్నారు. భవిష్యత్తులో జమ్మలమడుగు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే రాష్ట్రంలో చంద్రబాబు, నియోజకవర్గంలో భూపేష్‌రెడ్డి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అభివృద్ధి చేసే వారిని గుర్తించి ఓటు వేయాలని నవనీశ్వర్‌రెడ్డి ప్రజలను కోరారు.



మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న భూపేష్‌రెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

బండలాగుడు పోటీల ప్రారంభ కార్యక్రమంలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి - ఖాజీపేట

కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా శైవ క్షేత్రాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలోని శివ భక్తేంద్రాలయం, పుల్లూరు సమీపంలోని నాగనాథేశ్వర ఆలయ శైవక్షేత్రానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. మైదుకూరు నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఎంపిపి అబుబకర్ సిద్దిక్, పుల్లూరు ఉపసర్పంచ్, వైసిపి నాయకులు ఇరగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, ఆంజనేయ కొట్టాల సర్పంచ్ పెద్దిరెడ్డి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు మున్వర్ హుస్సేన్, డీలర్ చంద్ర, సచివాలయ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, ఎంపిటిసిలు సభ్యులు, వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు, కాశినాయన ఆలయం వద్ద ఏర్పాటుచేసిన కోలాటం అలరింపజేసింది. వైసిపి మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి బండలాగుడు పోటీలను ప్రారంభించారు. అనంతరం పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు.

ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలి : 'పుట్టా'

ప్రజాశక్తి - ఖాజీపేట

రానున్న 2024 ఎన్నికల్లో ప్రజలందరూ టిడిపిని ఆదరించాలని, ముఖ్యమంత్రిగా చంద్రబాబును నియమించుకునే బాధ్యత ప్రజలందరిదని మైదుకూరు పార్టీ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ కోరారు. మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీలోని ఎస్సీ కాలనీలలో సోమవారం పుట్టా సుధాకర్ యాదవ్ బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. టిడిపి మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండలశాఖ అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, నాయకులు ఇరగంరెడ్డి ప్రతాప్‌రెడ్డి, నంద్యాల సుబ్బయ్య యాదవ్, పత్తూరు ఉపసర్పంచ్, టిడిపి యువ నాయకులు ముత్తూరు రమణ, కమలాపురం ఫరూక్ అహ్మద్, కమలాపురం గౌస్ మొహిద్దిన్, జెండాల మహబూబ్ బాషా, గోవిందు సుబ్బయ్య, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు గంగాధర్, డాక్టర్ ఆసిఫ్, పిచ్చి నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి పలువురు టిడిపిలో చేరిక

పుల్లూరు పంచాయతీ పాత పుల్లూరు దళితవాడకు చెందిన పలువురు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. గ్రామానికి చెందిన కమ్మా నరసింహులు, విజయ్, మీసాల రమేష్, రవి, నాగేంద్ర టిడిపి మైదుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, టిడిపి మండల కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా వేసి వారిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వంపై విసుకు చెంది ప్రజలందరూ టిడిపి తీర్థం పుచ్చుకుంటున్నారన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో టిడిపి బలోపేతం అవుతోందన్నారు. కార్యకర్తలు, గ్రామ నాయకులు కూడా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కులందరూ కూడా ప్రజలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న పుట్టా, లక్ష్మిరెడ్డి

వ్యత్యాసాన్ని గమనించి మద్దతివ్వండి : ఎమ్మెల్యే

పజాశక్తి - ప్రొద్దుటూరు

గత పాలకులకు తనకు వ్యత్యాసాన్ని గుర్తించి మద్దతివ్వండని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి కోరారు. స్థానిక 17వ వార్డులో రూ.30లక్షల అంచనాతో రోడ్డు నిర్మా ణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 15రోజుల క్రితం ఇక్కడకు వచ్చిన సమయంలో రోడ్డు కావాలని స్థానికులు అడిగారన్నారు. ఇక్కడి ప్రజల అవసరాన్ని గుర్తించి నేడు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. వారంలో రోడ్డు పనిని పూర్తి చేస్తామన్నారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో రూ.110కోట్లతో మౌలిక వసతులు, రూ.150కోట్లతో మంచినీటి సౌకర్యం కల్పించామన్నారు. ప్రజలకు అత్యంత అవసరమైన ఈ అభివృద్ధి పనులను గత పాలకులు ఎందుకు చేయలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మిదేవి, కౌన్సిలర్ చింతకుంట సరితారెడ్డి, డిఇ రమణ, వైసిపి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

రోడ్లపై ధాన్యం.. ఆదమరిస్తే ప్రమాదం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వరిపైరు నూర్పిడి అనంతరం రైతులు ధాన్యాన్ని ప్రధాన రోడ్లమీద ఆరవేస్తున్నారు. ఆ రోడ్లపై వెళ్లే వాహనదారులు ఆచీతూచీ వెళ్లాల్సి ఉంది. ఏమాత్రం ఆదమరిచినా వాహనం అదుపుతప్పే ప్రమాదం ఉంది. జమ్మలమడుగు నుంచి ముద్దనూరుకు పోయే రహదారిలోనూ, జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు పోయే మార్గంలోనూ గూడెం చెరువు, అంబవరం, అనంతగిరి, ధర్మపురం, గొరిగనూరు, దానవులపాడు, సుగుమంచిపల్లె తదితర గ్రామాల రైతులు రోడ్డు పక్కనే ఉన్న పంటలను నూర్పిడి చేసి ఆరబెట్టుకుంటున్నారు. మేఘాలు ఆడుతున్నందున వరి కయ్యలు తడిగా ఉంటున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులు వరి ధాన్యాన్ని రోడ్లమీద వేశారు. ద్విచక్ర వాహనదారులు, పెద్ద వాహనాలు పగలు.. రాత్రి వేగం తగ్గించి రావాల్సి ఉంటుంది. లేకుంటే అటు వాహన దారులకు, ఇటు రైతులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

పది మూటలు రూ.19,800

నూర్పిడి అనంతరం వరి ధాన్యం రోడ్ల మీద ఆరబెడితే కొనుగోలు దారులు నేరుగా రైతుల వద్దకు వస్తున్నారు. పది మూటలు (ఒక పుట్టి) రూ.19,800 ధర పలుకుతోంది. ఈ ధరతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది వర్షాలు తక్కువ కావడంతో పండిన పంటకు భవిష్యత్తులో మరింత గిరాకీ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పశుగ్రాసానికి కూడా మంచి ధర పలుకనుంది.

రోడ్డుపై ఆరవేసిన వరి ధాన్యం

మాట్లాడుతున్న టిడిపి, జనసేన నాయకులు

పాలన చేతకాని సిఎం జగన్ : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె

ప్రజా పరిపాలన చేతకాని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. సోమవారం తన కార్యాలయంలో జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామదాస్ చౌదరితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన లోకేష్ యువగళం పాదయాత్ర పునఃప్రారంభం కావడం సంతోషదాయకంమన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారం చేయడానికి యువనేత నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర ఆగిపోయిన చోటు నుండే ప్రారంభం కావడం శుభ పరిణామని పేర్కొన్నారు. జనసేన రాయలసీమ కో-కన్వీనర్ రాందాస్ చౌదరి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైసిపి నాయకులకు ప్రజలు తగిన గుణ పాఠం చెబుతారన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం కాయమన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు నవీన్ చౌదరి, బాలుస్వామి, జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దదర్గాలో మొహియుద్దీన్

పెద్దదర్గాను సందర్శించిన మొహియుద్దీన్

ప్రజాశక్తి-కలికిరి

కడప అమీన్‌పీర్ పెద్దదర్గాను వైసిపి రాష్ట్ర కార్యదర్శి అగ మొహియుద్దీన్ సందర్శించాడు. ఈ సందర్భంగా గంధం ప్రార్థనలో ఆయన పాల్గొని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆయన బృందం షేక్ సంధాని బాషా, షేక్ ఖాజాపేర్, షేక్ నవాజ్, షేక్ నజీర్, జవహర్ ఖాన్, మౌలా అలీ, జాకీర్ హుస్సేన్ పాల్గొని పీఠధిపతి హాజరాత్ క్వాజా సయ్యద్ షా ఆరిఫుల్లా హుస్సేని వారి ఆశీర్వాదాలు పుచ్చుకున్నారు.

బోరు వేయిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

పంచాయతీ అభివృద్దే లక్ష్యం : ఎంపిటిసి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పంచాయతీని అన్నివిధాలా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఊటుకూరు ఎంపిటిసి నాగ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఊటుకూరు పంచాయతీ పరిధిలోని డిబియన్‌పల్లె అరుంధతి వాడలో సుమారు రెండు నెలల నుంచి మంచినీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సోమవారం ఆయన బోరు వేయించి ప్రజల నీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ తాను కూడా తన పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని తెలిపారు. తాగు నీరు, పారిశుధ్యం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పతకాలు ప్రతి గడపకు చేరే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఊటుకూరు సర్పంచ్ పల్లెపాగు ఈశ్వరయ్య, మాజీ సర్పంచ్ ఎంఎల్ నరసయ్య, కంభాయిగారి నరసింహులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు టిడిపి, జనసేన సమన్వయ సమావేశం

ప్రజాశక్తి-పెద్దమండ్యం

టిడిపి, జనసేన సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు వెంకటరమణ తెలిపారు. స్థానిక షాదీమహల్‌లో మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ అధ్యక్షతన సమావేశం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తల తరలిరావాలని కోరారు.

శివ నామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

ప్రజాశక్తి-పీలేరు

కార్తీక మాసోత్సవాల్లో భాగంగా రెండవ సోమవారం శైవక్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగిపోయాయి. పీలేరులోని శ్రీకాశీ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు విరూపాక్షం కుమార్ స్వామి స్వామివారికి వివిధరకాల పుష్పాలతో అలంకరించి భక్తులు మొక్కులు తీర్చుకోడానికి తగిన ఏర్పాట్లు చేశారు. స్వామివారికి అభిషేకం, తీర్థ, ప్రసాదాలు అందజేశారు. **రాజంపేట అర్బన్ :** పవిత్ర పుణ్యక్షేత్రమైన హత్తిరాల కామాక్షి త్రతేశ్వర స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి స్వామికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెలగచర్ల వెంకటసుబ్బారెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. **పుల్లంపేట:** కార్తీక పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని పూజారి శివప్రసాద్ శర్మ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో శివపార్వతులను అలంకరించారు. అనంతరం రొంపిచర్ల హరి దంపతుల ఆధ్వర్యంలో వెయ్యి మందికి అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో రొంపిచర్ల లక్ష్మీనారాయణ, రొంపిచర్ల ఈశ్వరయ్య కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. **కలకడ:** మండలంలో కేదారేశ్వర వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. దేవలంపేటలో వెలిసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకటలాడింది. ఆలయ కమిటీ సభ్యులు ధర్మకర్తలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయక ధర్మకర్త అఖిలేష్, మాజీ ఆలయ ధర్మకర్త ప్రసాద్, కమిటీ సభ్యులు మల్లికార్జున నాయుడు, మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, కుమార్ నాయుడు, రెడ్డప్ప నాయుడు, శ్రీనివాస్ నాయుడు. వై.సుధాకర్ నాయుడు పాల్గొన్నారు. **నందలూరు:** మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మారు మోగాయి. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళలు భక్తిశ్రద్ధలతో శివలింగం రూపంలో దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు.



రాజంపేట : ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే మేడా